సాక్షి వరంగల్

శుక్రవారం । 7 । జూన్ । 2024



పట్టుదలతో సాధన చేయాలి

అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లోనూ పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం మీ సొంతం అవుతుందని అంతర్జాతీయ అథ్లెట్ నందిని అన్నారు. - 8లో▸



'పట్టభద్రుల' ఫలితంపై ఉత్కంఠ

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌లో ఉత్కంఠ నెలకొంది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ గెలుపునకు సరిపడా ఓట్లు రాలేదు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం $37^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో వర్షం పడే అవకాశం ఉంది.

శాస్త్రవేత్తలతో ఫోన్ ఇన్



కాశీబుగ్గ: ~~~
కాశీజీ సెంటర్: రుతుపవనాలు ప్రారంభం కావడంతో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలతో శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 'సాక్షి' ఫోన్ ఇన్ ప్రోగ్రాం నిర్వహించనుంది. జిల్లాలోని రైతులు పంటల సాగు కోసం తమ సందేహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం ఈ కింది నంబర్లలో సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ తెలిపారు.

తేది : 08-06-2024, శనివారం
ఫోన్ చేయాల్సిన నంబర్లు :
7288894705, 8328307784, 9989623814
సమయం : ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గీసుకొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గీసుకొండ పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య కార్యక్రమాల గురించి వైద్యాధికారి అర్చనను అడిగి తెలుసుకున్నారు. అన్ని కార్యక్రమాలకు సంబంధించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన పొదుపు సంఘాల మహిళలు



గీసుకొండ: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన పొదుపు సంఘాల మహిళలు గురువారం సందర్శించారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భూపాలపల్లి మండల పరిధిలోని 10 గ్రామాలకు చెందిన 15 మంది పొదుపు సంఘాల మహిళా లీడర్లు, ట్రస్ట్ ఏరియా టీం లీడర్ ఎం.సుబ్రహ్మణ్యం, కమ్యూనిటీ ఆర్గనైజర్ పద్మ, వెంకటేశ్వర్, ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి గురించి వారికి జిల్లా ట్రెనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, మేడిద సుశీల, గూడ సరోజన వివరించారు.

త్వరలో 'కోచ్ రెస్టారెంట్'



కాశిబుగ్గ: సికింద్రాబాద్, కాచిగూడలో మాదిరి వరంగల్ రైల్వే స్టేషన్‌లో త్వరలో 'కోచ్ రెస్టారెంట్' ఏర్పాటు చేయనున్నట్లు సికింద్రాబాద్ డివిజనల్ ఏడీఆర్ఎం(ఐ) గోపాల్ తెలిపారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు ఆధునికీకరణ పనులను ఆయన అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రత్యేక రైలులో కొండపల్లి నుంచి విండో ఇన్‌స్పెక్షన్ చేసుకుంటూ ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్ రైల్వే స్టేషన్లను తనిఖీ చేశారు. సాయంత్రం 4.46 గంటలకు వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు.

పరిశీలన

నాలుగో ప్లాట్‌ఫాంలో దిగిన ఆయన నేరుగా బస్టాండ్ వైపు జరుగుతున్న స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. స్టేషన్ ఎదుట స్తంభాలపై ఏర్పాటు చేసే ఏనుగు విగ్రహాల్ని, ఐఓడబ్ల్యూ కార్యాలయం ఎదుట త్వరలో ఏర్పాటు చేయనున్న కోచ్ రెస్టారెంట్ స్థలాన్ని, మొదటి ప్లాట్‌ఫాం వైపు ఉన్న ప్రీపెయిడ్ వెయిటింగ్ హాల్, రిజర్వ్‌డ్ ప్రయాణికులు వేచి ఉండే వెయిటింగ్ హాల్, నిర్మాణంలో ఉన్న జనరల్ వెయిటింగ్ హాల్, నిర్మాణంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. అనంతరం సాయంత్రం 5.45 గంటల సమయంలో ప్రత్యేక రైలులో సికింద్రాబాద్‌కు వెళ్లిపోయారు. ఆయన వెంట గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్రహ్మణ్యం, సీనియర్ డీఈఎన్ ప్రణీత్ దినకరన్, స్టేషన్ మేనేజర్ బాలరాజు ఉన్నారు.

● మంత్రి గారూ.. గీ పనులు చూడండి

ఆధునికీకరణలో అనకొండలు!

ఎస్సారెస్పీ కాల్వల పునరుద్ధరణలో అవినీతి

- ఏడేళ్లుగా కాలయాపన.. వానాకాలంలో మొదలు పెట్టిన కాంట్రాక్టర్లు
- గతంలో చేసిన పనుల్లో రూ.కోట్లల్లో నిధులు స్వాహా
- డీబీఎం-38, 48 పనులపై 'విజిలెన్స్' పెండింగ్
- హడావుడిగా పనులు, నేడు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్లనున్న రైతులు!



హనుమకొండ-కరీంనగర్ హైవే సమీపంలో హడావుడిగా చేపట్టిన కాల్వ ఆధునికీకరణ పనులు

మొత్తం పనులు	83
మంజూరైన నిధులు	రూ.873.61 కోట్లు
పనులు ప్రారంభం	2017 అక్టోబర్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల మరమ్మతులు, పునరుద్దరణ పనుల్లో అక్రమాలు పారుతున్నాయి. ఎస్సారెస్పీ స్టేజ్-1లో రూ.కోట్ల విలువ చేసే లైనింగ్, పూడికతీత తదితర పనులు తూతూమంత్రంగా కొనసాగుతున్నాయి. 2017లో అప్పటి ప్రభుత్వం రూ.873.61 కోట్లతో 83 పనులు మంజూరు చేసింది. సుమారు ఏడేళ్లుగా సాగుతున్న ఈ పనులపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని చోట్ల సగం పనులే జరగ్గా.. మరికొన్ని చోట్ల పూర్తవకుండానే బిల్లులు మంజూరు చేశారు. పలు ప్రాంతాల్లో ప్రారంభించని పనులకు సైతం బిల్లులు చెల్లించారు. ఈఅక్రమాలపై ఆయకట్టు రైతు సంఘాల నేతలు అప్పట్లోనే గత ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. విచారణకు ఆదేశించడంతో మధ్యలోనే పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు, అధికారులు.. ఆ విచారణ తేలకుండానే ప్రభుత్వం మారిన తర్వాత గుట్టుచప్పుడు కాకుండా పనులు 'మమ' అనిపించి బిల్లులు కొట్టేయాలని చూస్తున్నారు. పనుల్లో లోపాలపై కొందరు ఆ శాఖ ఉద్యోగులే తాజాగా 'విజిలెన్స్'కు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. 'కాళేశ్వరం'లో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టిన ప్రభుత్వం.. ఎస్సారెస్పీ ఆధునికీకరణ పనులపై విచారణ జరిపించాలని కొందరు రైతులు, రైతు సంఘాల నాయకులు శుక్రవారం జిల్లాలో పర్యటిస్తున్న భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

పెండింగ్‌లో విజి'లెన్స్'

వరంగల్ జిల్లాలోని ఎస్సారెస్పీ డీబీఎం-48 సీసీహెచ్ డివిజన్ నంబర్ 4 పరిధి తీగరాజుపల్లి, పర్వతగిరి, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని తీర్థాల వరకు ఆధునీకీకరణ పనుల కోసం రూ.123 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డీబీఎం-48, 1ఆర్, 2ఎల్, 3ఎఆర్, 6ఎల్, 10ఆర్, 1,13ఆర్, 16ఆర్, 17ఎల్, 21ఆర్, 24ఆర్, 25ఎల్, 26ఎల్, 27ఎల్, 28ఆర్, 29ఎల్, 30ఆర్, 31ఎల్, 32ఎల్, 34ఆర్, 35ఎల్, 26ఆర్, 38ఆర్ ఉప కాల్వల అభివృద్ధి, ఎర్త్ వర్క్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు చేయకుండానే కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.17 కోట్ల పనులు జరిగినట్లుగా బిల్లులు రికార్డు చేసుకొని, డబ్బులు డ్రా చేసుకున్నారనే ఫిర్యాదులపై ప్రభుత్వం ఆదేశించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ ఇంకా సాగుతోంది. డీబీఎం-38 ప్యాకేజీ పనులు గీసుకొండ, మల్లంపల్లి, పరకాల వరకు రూ.123 కోట్ల అంచనా వ్యయంతో డోవెల్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్‌ల అభివృద్ధి కోసం కేటాయించిన నిధుల దుర్వినియోగంపై విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో ఏడేళ్ల పెండింగ్‌లో ఉన్న పనులను వర్షాకాలం ముందు ప్రారంభించడం వల్ల మళ్లీ నాసిరకం పనులతో నిధులు కాజేసే అవకాశం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.



మొక్కుబడిగా ఎస్సారెస్పీ కాల్వల లైనింగ్, ఆధునికీకరణ పనులు

ఏడేళ్లుగా తాత్సారం.. హడావుడిగా ప్రారంభం

ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ కోసం 2017లో 83 పనుల కోసం రూ.873.61 కోట్లు జీఓ ఎంఎస్ 67 ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిజామాబాద్ జిల్లా పోచంపాడ్ నుంచి (0.000 కి.మీ.ల నుంచి 284.000 కి.మీ.ల) ఖమ్మం జిల్లా తీర్థాల వరకు ప్రధాన కాల్వల ఆధునికీకరణతో పాటు లక్ష్మీ కెనాల్, సరస్వతి కెనాల్, సదర్మాట్ల మెయింటెనెన్స్ పనుల కోసం నిధులిచ్చారు. కాకతీయ ప్రధాన కాల్వ ఏడు పనుల కోసం రూ.385.56 కోట్లు, 63 డిస్ట్రిబ్యూటరీల కోసం రూ.356.14 కోట్లు కేటాయించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈపనులకు 2017లో టెండర్లు జరగ్గా, వరంగల్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్లు ఈ పనులు చేజిక్కించుకున్నారు. టెండర్లు వేసిన నాటికి అర్హత లేని ఓ కాంట్రాక్టర్ (ఇరిగేషన్ పనుల్లో కీలకం) వరంగల్ జిల్లాకు చెందిన కొందరు అప్పటి కీలక ప్రజాప్రతినిధులతో అసలు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసి పనులు దక్కించుకున్నారు. అర్హతపై వచ్చినవి.. అర్హత లేకుండా ఇతరుల పేరిట పొందినవి ఇప్పటికీ పూర్తి చేయని సదరు కాంట్రాక్టర్ కూడా ఇటీవలే హడావుడిగా పనులు చేపట్టారు. గతంలో ఇదే కాంట్రాక్టర్ కరీంనగర్‌లో చేసిన కాల్వల పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న ఫిర్యాదులున్నాయి. ఇదిలా ఉంటే.. ఏడాదిలో ఆధునికీకరణ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా.. ఏడేళ్ల తాత్సారం చేసిన కాంట్రాక్టర్లు, అధికారులు వానాకాలంలో ఎల్కతుర్తి, హసన్‌పర్తి, హనుమకొండ మండలాల్లోని ప్రధాన కాల్వల లైనింగ్ పనులు హడావుడిగా చేపట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడిపై పోక్సో కేసు

సంగెం: పెళ్లి చేసుకుంటానని చెప్పి నమ్మించి బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమ్లతండా గ్రామానికి చెందిన ఓ యువకుడి పెళ్లికి ఓ బాలిక వచ్చింది. అదేతండాకు చెందిన బానోత్ చందూలాల్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి తరచుగా ఫోన్‌లో మాట్లాడేవాడు. అప్పుడప్పుడు బయటకు తీసుకెళ్లి ఫొటోలు దిగాడు. తండాలోని సోదరి ఇంటికి బాలిక రాగా ఆమెను లొంగదీసుకోవడానికి ప్రయత్నిస్తే నిరాకరించింది. ఫోన్‌లో బాలికతో ఉన్న ఫొటోలు చూపించి అందరికి పంపిస్తానని బెదిరించాడు. ఆ తర్వాత నుంచి బాలిక ఇంటికి వెళ్లి ఎవరు లేని సమయంలో లొంగదీసుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోనని మొహం చాటేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చందూలాల్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సోమ్లాతండాలో బుధవారం మధ్యాహ్నం నిందితుడిని పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేశ్ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై..

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో అల్లం సాంబయ్య ఇంటి స్థలానికి దొంగపత్రాలు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఎస్సై షేక్‌జానీపాషా తెలిపారు. సాంబయ్యకు సుమారు రెండు గుంటల భూమి ఉంది. ఆ భూమిని ఆయన తమ్ముడు అల్లం కుమారస్వామి తన భార్య సుజాత పేర అక్రమంగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, అంతేకాకుండా ఆక్రమించుకోవాలని చూశాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీజీ సెంటర్: డీఎడ్, డీపీఎస్ఈ కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 7న నిర్వహించే డీఈఈ సెట్-2024కు శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈఓ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://deecet. cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ముమ్మరంగా 'కాళేశ్వరం' మరమ్మతు పనులు

- నేడు బ్యారేజీలను సందర్శించనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- క్షేత్రస్థాయిలో మరమ్మతుల పరిశీలన..
- నేడు అన్నారం బ్యారేజీకి జస్టిస్ పీసీ ఘోష్ బృందం

గతేడాది అక్టోబర్ 21న కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ వంతెనతోపాటు పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. వీటిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు పలుమార్లు పరిశీలించారు. నిర్వహణను నిర్మాణ సంస్థలు భరించాలని సీరియస్‌గా చెప్పడంతో ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకు తాత్కాలిక మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బ్యారేజీలను రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించనున్నారు. అదేవిధంగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ బృందం కూడా రానుంది.

- సాక్షిప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం



మేడిగడ్డలో డ్రిల్ వేసి మట్టి పరీక్షలు చేస్తున్న శాస్త్రవేత్తల బృందం

- వివరాలు 8లో▸

'దశాబ్ది డిపాజిట్'ను సద్వినియోగం చేసుకోవాలి

దుగ్గొండి: తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నోడల్ అధికారి స్రవంతి సూచించారు. మండలంలోని మహ్మదాపురం, నాచినపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆవరణలో రైతులకు డిపాజిట్లపై గురువారం అవగాహన కల్పించారు. బ్రోచర్లు విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. సహకార బ్యాంకులో డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ వస్తుందన్నారు. రూ.5లక్షల వరకు డిపాజిట్ చేసుకుంటే ప్రతి మూడు నెలలకు వడ్డీ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ నరేందర్, సీఈఓ రమేశ్, గోవర్ధన్, స్వామి, సంజీవరెడ్డి, అనిల్, రాజు, సురేందర్, ప్రకాశ్, సాంబయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.



నల్లబెల్లి : కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

డిపాజిట్లపై 8.10 శాతం వడ్డీ..

నల్లబెల్లి: అత్యధిక వడ్డీ రేటు అందిస్తున్న దశాబ్ది డిపాజిట్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నోడల్ అధికారి స్రవంతి కోరారు. నల్లబెల్లి బ్రాంచ్‌లో దశాబ్ది డిపాజిట్ పథకంపై ఖాతాదారులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. డిపాజిట్ చేసిన డబ్బులకు అత్యధికంగా 8.10 శాతం వడ్డీ డిపాజిట్ దారుడికి చెల్లిస్తామని పేర్కొన్నారు. అత్యధికంగా రూ.5 లక్షల వరకు డిపాజిట్ చేసుకునే సౌకర్యం ఉందని వివరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం కరపత్రాలను డీసీసీ బ్యాంకు డైరెక్టర్ చెట్టుపల్లి మురళీధర్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు మేనేజర్ నరేందర్, పీఏసీఎస్ సీఈఓ నాగెల్లి మొగిలి, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టీఎస్ ఐసెట్

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం వరంగల్ రీజియన్‌లో రెండో రోజు గురువారం నిర్వహించిన టీఎస్ ఐసెట్‌కు 1,456 మంది హాజరయ్యారు. వరంగల్ రీజియన్‌లో 8 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్)లో ఈపరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగింది. హనుమకొండ, వరంగల్, నర్సంపేటలోని పరీక్ష కేంద్రాల్లో 1,545 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 89 మంది గైర్హాజరైనట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. ఈనెల 5, 6 తేదీల్లో కలిపి మొత్తం మూడు సెషన్లలో 4,659 మంది అభ్యర్థులకు 295 మంది గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్ ప్రాథమిక కీని ఈనెల7న సాయంత్రం విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8, 9 తేదీల్లో అభ్యర్థులు తమ అభ్యంతరాలను హెచ్‌టీటీపీఎస్://ఐసెట్.టీఎస్‌హెచ్‌ఈ.ఏసీ.ఇన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యంతరాలను పరిశీలించి 10వ తేదీన క్లారిఫికేషన్ వివరాలు కూడా సంబంధిత వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. సాధ్యమైనంత త్వరలోనే ఈ టీఎస్ ఐసెట్ ఫలితాలను విడుదల చేస్తామన్నారు.



పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

భర్త మందలించాడని ఆత్మహత్య



బాజీ(ఫైల్)

రాయపర్తి(వర్ధన్నపేట): భర్త మందలించాడని మనస్తాపానికి గురైన భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం వర్ధన్నపేట మండలం మూడుగుండ్ల తండా (రాంధాన్‌తండా)లో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ పూల్య, బానోతు బాజీ(60) దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరందరికీ వివాహం జరిగింది. భార్యభర్త మధ్య తరచు గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 4న పూల్య తన భార్య బాజీని మందలించాడు. మనస్తాపానికి గురైన బాజీ పురుగులమందు తాగింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వర్ధన్నపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు బానోత్ మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూమిలో పదును ఉంటేనే విత్తుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్

దుగ్గొండి: మార్కెట్‌లో వ్యాపారులు సృష్టించే గందరగోళంతో పత్తి రైతులు పరేషాన్ కావొద్దని జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్ అన్నారు. భూమిలో పదును ఉంటేనే విత్తనాలు విత్తుకోవాలని ఆమె సూచించారు. వానాకాలం సీజన్‌లో పత్తి విత్తనాలు నాటడం, విత్తనాల ఎంపికపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురువారం డీఏఓ వివరించారు.

60-65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతేనే..

పత్తిపంటను వర్షాధారంగా, నీటి వసతి ఉన్న భూముల్లో సాగు చేయవచ్చు. నేలను పలుమార్లు బాగా దున్ని అందులో పశువుల ఎరువు లేదా కోడి ఎరువు వేయాలి. 60-65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి. పదును లేకుండా విత్తుకుంటే విత్తనాలు సరిగా మొలకెత్తక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. భాస్వరం ఎరువులను నేలలోనే వేసుకోవాలి.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు..

రైతులు పత్తి విత్తనాలను ఎంపిక చేసుకునేటప్పుడు అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. 2-3 సంవత్సరాల కాలంలో తమ ప్రాంతంలో ఏ రకం విత్తనాలు అధిక దిగుబడి ఇచ్చాయో వాటినే ఎంపిక చేసుకోవాలి. విత్తన లైసెన్స్‌లు కలిగి ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి. బిల్లు అడిగి తీసుకోవాలి. బిల్లులో విత్తన వివరాలు సరిగా ఉన్నాయో లేవో చూసుకోవాలి. పంట చేతికి వచ్చే వరకు బిల్లులను జాగ్రత్తగా దాచిపెట్టుకోవాలి. విడి, గుడ్డ సంచుల్లో వచ్చే పత్తి విత్తనాలను కొనుగోలు చేయవద్దు. అలా ఎవరైనా అమ్మితే వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి. విత్తన ప్యాకెట్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పూర్తి వివరాలు వస్తాయి వాటిని పరిశీలించుకోవాలి.



అంతర పంటల సాగు..

పత్తి పంటలో సాళ్ల మధ్య పెసర, మినుము, కంది అంతర పంటలు సాగు చేసుకోవాలి. అంతర పంటలతో పంటకు పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ ఉధృతి ఉండదు.

అధిక సాంద్రత సాగు.. దిగుబడి బాగు

పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. సాధారణ అచ్చులోనే సాలు పద్ధతిలో విత్తనాలు దగ్గర దగ్గరగా వేసుకోవాలి. ఎకరాకు 4 నుంచి 5 ప్యాకెట్లు విత్తుకోవాలి. 25 వేల నుంచి 33 వేల మొక్కలు ఉండేలా చూసుకోవాలి. 40-45 రోజుల వయసులో చమత్కార్ మందును పిచికారీ చేయడం వల్ల పెరుగుదల నియంత్రించడంతోపాటు పంట ఒకేసారి కాపునకు వస్తుంది. కాయలు ఒకేసారి పగిలి పంటంతా ఒకేసారి చేతికి వస్తుంది. సాధారణ పద్ధతిలో కన్నా 50 శాతం అధిక దిగుబడి వస్తుంది. రెండో పంట వేసుకోవడానికి అనుకూలంగా ఉండటంతో పాటు గులాబీరంగు పురుగు బెడద ఉండదు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు : కలెక్టర్

కాశీజీ సెంటర్: జిల్లాలో ఈనెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. 17 కేంద్రాల్లో 9,168 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి గ్రూప్-1 పరీక్ష నిర్వహణ, సీజన్ విత్తనాలు,ఎరువుల లభ్యత, మిషన్ భగీరథ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడారు. పరీక్ష ప్రశాంత వాతావరణలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాలు, తిరిగి పరీక్ష కేంద్రాల నుంచి జవాబు పత్రాలను రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి పలు సూచనలు చేసినట్లు వివరించారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఈఓ వాసంతి, వ్యవసాయాధికారి ఉషాదయాళ్, ఏసీపీలు నందిరాంనాయక్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

11 నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు


కేయూ క్యాంపస్: కేయూలో పీజీ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్యజీ గురువారం తెలిపారు. ఈనెల 11, 13, 15, 19, 21, 24 తేదీల్లో ఈపరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

ఆపన్నహస్తం అందించరూ!

- అనారోగ్యం బారిన తల్లి
- ఆర్థికసాయం కోసం పిల్లల ఎదురుచూపు



సాయం కోసం దీనంగా చూస్తున్న పిల్లలు



తొర్రూరు రూరల్ : అసలే నిరుపేద.. ఆపై పిల్లల చిన్నతనంలో తండ్రి మృతి.. ఇంకేముంది ఆ తల్లిపై కుటుంబ భారం పడింది. అయినా ఏ మాత్రం అధైర్య పడకుండా కూలీ పని చేసుకుంటూ ముగ్గురు పిల్లలను సాకుతోంది. ఉన్నంతలో హాయిగా జీవిస్తున్న ఆ కుటుంబంలో మాయదారి రోగం చిచ్చుపెట్టింది. తల్లిని ఆరు నెలల క్రితం అనారోగ్యానికి గురిచేయడంతో ఆమె మంచానికే పరిమితమైంది. ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుదామంటే చేతిలో చిల్లిగవ్వ లేని స్థితి. పైగా పూటగడవదని దుస్థితి. ఫలితంగా పిల్లలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై దాతలు స్పందించి తమ తల్లి చికిత్స కోసం ఆర్థిక సాయం చేయాలని పిల్లలు చేతులెత్తి వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంఠాయాపాలెం గ్రామానికి చెందిన నిరుపేద బెడ బుడ్గ జంగాల కులానికి చెందిన పస్తం ముత్యాలు, ముత్తయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పిల్లల చిన్నతనంలోనే తండ్రి ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ముత్యాలు తన ముగ్గురు కుమారులు రాజేశ్, రమేశ్, సాయిలను కూలీ చేసుకుంటూ పోషించింది. ఈక్రమంలో ఆరునెలల క్రితం ముత్యాలు ఆరోగ్యం క్షీణించడంతో మంచం పట్టింది. దీంతో పూటగడవడం కష్టంగా మారింది. కూలీ పనులకు వెళ్దామంటే ఆరోగ్యం సహకరించక.. వైద్య చికిత్సలకు డబ్బులు లేక ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. దీనిపై దాతలు స్పందించి తమ తల్లి ఆరోగ్యాన్ని బాగు చేయించేందుకు ఆర్థిక సాయం అందించాలని పిల్లలు వేడుకుంటున్నారు. దాతలు 8978511384 నంబర్‌కు ఫోన్ పే చేయాలని వారు కోరుతున్నారు.

ఆట.. అంతంత మాత్రమే



'నా చిన్నతనంలో దాదాపు 40 ఏళ్ల క్రితం సుబేదారిలోని ఆర్ట్స్ కాలేజీ మైదానం క్రీడాకారులతో సందడిగా ఉండేది. ఏళ్లు గడుస్తుంటే క్రీడాకారుల సంఖ్య పెరుగుతూ రావాలి.. కానీ అందుకు భిన్నంగా విద్యార్థులకు క్రీడలను దూరం చేసే పరిస్థితులు నెలకొన్నాయి' అని రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ వెనుకంటి రామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధి గురించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై 2014లో వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు రామ్మూర్తి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వరంగల్ స్పోర్ట్స్

పదేళ్లలో క్రీడారంగ అభివృద్ధి కొంతే

- పేరుకే స్టేడియాలు, కోచ్‌ల నియామకం లేదు
- రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ వెనుకంటి రామ్మూర్తి




- తెలంగాణ రాష్ట్ర రెండో రాజధానిగా చెప్పుకుంటున్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేరుకే స్టేడియాలు. ఉమ్మడి జిల్లా కేంద్రంగా హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం తప్పితే, కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో కాగితాల్లోనే స్టేడియాలు. అంతే ఎక్కడా క్రీడా వాతావరణం కనిపించడం లేదు. ఖాళీ స్థలాలను స్టేడియాలుగా చూపించారే తప్ప మౌలిక వసతులు కల్పించలేదు. ములుగు, జనగామ, మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి జిల్లా కేంద్రాల్లో ఇదివరకే నిర్వహణలో ఉన్న ఖాళీ స్థలాలను స్టేడియాలుగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం.. కొన్ని జిల్లాల్లో అయితే క్రీడలకు సంబంధం లేని అధికారులను జిల్లా క్రీడల అధికారులుగా నియమించింది. ఫలితంగా ఆటలు..అంతంత మాత్రమేగా మారాయి..
- ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రం హనుమకొండలో సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇప్పటికీ వసతుల కొరత స్పష్టంగా కనబడుతోంది. నాలుగేళ్ల క్రితం నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జిమ్నాజియం హాల్ నిర్వహణ లేక పాడయ్యే దుస్థితిలో ఉంది. స్టేడియానికి వచ్చే క్రీడాకారులకు వ్యాయామశాలలో పరికరాలు కూడా సరిగా లేవు. ఇక స్టేడియం నిర్వహణ కోసం గ్రౌండ్‌మెన్లు లేకపోవడం బాధాకరం. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న జేఎన్ స్టేడియంలో ఇప్పటికీ రెగ్యులర్ కోచ్‌లు లేరు. ఉన్న వారందరూ తాత్కాలిక ఉద్యోగులే.
- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్టేడియంలో కొనసాగుతున్న లాన్‌టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, రెజ్లింగ్, క్రికెట్ క్రీడలు నేర్చుకోవాలంటే క్రీడాకారులు (పే అండ్ ప్లే) నెలకు ఫీజు చెల్లించాలి. 20 సంవత్సరాల క్రితం ఈ పద్ధతి లేదు. డబ్బులు ఇస్తేనే క్రీడల్లో శిక్షణ ఇచ్చే పద్ధతి సరికాదు. అంతేకాదు విద్యార్థుల్లో నేర్చుకోవాలనే తపన కలిగేలా ఉచిత శిక్షణతో పాటు క్రీడా సామగ్రిని ఉచితంగా అందుబాటులో ఉంచాలి. అప్పుడే ప్రతి ఒక్కరూ ఆర్థిక తారతమ్యాలు లేకుండా ప్రతిభ గల క్రీడాకారులు, క్రీడా రంగ అభివృద్ధి సాధ్యం.
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి. గత పదేళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జాతీయ స్థాయిలో రాణించి వారి సంఖ్య వేళ్ల పై లెక్కించొచ్చు. అతి కష్టంపై జాతీయ స్థాయికి వెళ్తే సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చతికిలపడుతున్నారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో 2 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి. గత పదేళ్లలో 2 శాతం క్రీడా కోటా అమలు చేసిన దాఖలాలు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జాతీయ స్థాయిలో రాణించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కులవృత్తులు, ఇతర కూలీ పనులు చేసుకుంటున్న వారు అనేకం. ఆటలు కూడు పెట్టవు.. చదువుకుంటేనే ఉద్యోగం వస్తుందనే తల్లిదండ్రుల తీరును పాలకులు మార్చాల్సిన అవసరం ఉంది.
- పదో తరగతి, ఇంటర్మీడియేట్‌లో టాపర్‌గా వస్తున్నాడంటే ప్రత్యేక క్లాసులు, ట్యూషన్ చెబుతున్నారు. అలాగే క్రీడల్లో టాపర్‌గా నిలవాలంటే పాఠశాలల్లో నిర్బంధ వ్యాయామ విద్య అమలు చేయాలి. చిన్న తనంలోనే పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెరిగేలా నూతన ఒరవడి స్కీంలు తీసుకురావాలి. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలతో పాటు క్రీడా సామగ్రి అందజేయాలి. తప్పనిసరిగా రోజు సాయంత్రం 40 నిమిషాలు విద్యార్థులు క్రీడా మైదానాల్లో ఆడేలా చర్యలు తీసుకురావాలి. వ్యాయామ విద్య అంటే చదువుకోవడం కాదు.. మైదానంలో శారీరక శ్రమ అలవర్చడం. తద్వారా మానసికంగా , శారీరకంగా విద్యార్థి దృఢంగా తయారవుతాడు, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం.
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉంటే ఒక్క ఫిజికల్ డైరెక్టర్ లేడు. 13 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉంటే కేవలం ముగ్గురు మాత్రమే ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. గత పదేళ్లలో కనీసం కాంట్రాక్ట్ ప్రాతిపదికన కూడా ఫిజికల్ డైరెక్టర్లను నియమించలేదు. ప్రతి 250 మంది విద్యార్థులకు ఒక్క పీఈటీ ఉండాలనే ప్రభుత్వ నిబంధనలు మూలనపడ్డాయి. పీఈటీల నియామకం ఎప్పుడో 20 సంవత్సరాల క్రితం జరిగిందే. ప్రతి క్రీడాకారుడికి పాఠశాల ముఖ్యమైంది. అక్కడే క్రీడల్లో బీజం వేయాలి .
- స్టేడియాలకు పూర్వవైభవం రావాలంటే వసతుల కల్పనతో పాటు కోచ్‌లు, సిబ్బందిని నియమించాలి. అందుకు ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలి, బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు తీసుకురావాలి. అప్పుడే క్రీడా రంగం అభివృద్ధి చెందుతుంది.

ముమ్మరంగా 'కాళేశ్వరం'మరమ్మతులు

ఇప్పటికే మేడిగడ్డ వద్ద సీఎస్ఎంఆర్ఎస్ బృందం

- నేడు, రేపు బ్యారేజీలను పరిశీలించనున్న జస్టిస్ పీసీ ఘోష్
- నేడు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ పర్యటన



మేడిగడ్డలోని 7వ బ్లాక్‌లో మొరాయించిన 17వ రేడియల్ గేటు ఎత్తిన దృశ్యం

సాక్షిప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ శుక్ర, శనివారాల్లో బ్యారేజీలను పరిశీలించనున్నారు. అదే విధంగా రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా శుక్రవారం పర్యటించనున్నారు. గతేడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ వంతెనతోపాటు పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. ఈ కుంగిన వంతెన, బ్యారేజీలను ఎన్డీఎస్ఏ సూచనల మేరకు తాత్కాలిక మరమ్మతులను ఇంజనీరింగ్ శాఖ అధికారులు, నిర్మాణ సంస్థలు చేపట్టాయి. ముఖ్యంగా 7వ బ్లాక్ లో 19, 20, 21 కుంగిన పియర్ల దిగువన షీట్ ఫైల్స్ అమర్చుతున్నారు. గేట్లను గ్యాస్ కట్టర్, గ్రౌగింగ్ ద్వారా విడిభాగాలుగా విడదీస్తున్నారు. ఏడో బ్లాక్‌లో ఏర్పడ్డ బొరియల (బుంగలు)ను గ్రౌటింగ్ ద్వారా సిమెంటు ఇసుక మిశ్రమాన్ని కలిపి నింపుతున్నారు. పనులన్నీ ముమ్మరం చేశారు. ఢిల్లీకి చెందిన సెంట్రల్ సాయిల్ మెటీరియర్ రిసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) శాస్త్రవేత్తల బందం జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలను చేస్తున్నారు. అన్నారం బ్యారేజీలో సీపేజీ లీకేజీలు గతేడాది అక్టోబర్‌లో బయటపడగా, వాటిని అప్పుడే కెమికల్ గ్రౌటింగ్ చేశారు. నాలుగు రోజుల కిందట బ్యారేజీలో బ్యారేజీ పొడువునా కిలోమీటర్ మేర ఇసుక తొలగించారు. 38వ పియర్ వద్ద వెంట్ చివరన సీపేజీ(బుంగలు) లీకేజీ ఏర్పడిన చోట గ్రౌటింగ్ సిమెంట్, ఇసుకను కలిపి పూడ్చుతున్నారు. సీసీ బ్లాక్ పనులు మళ్లీ చేపట్టారు.

మంత్రి ఉత్తమ్ పర్యటన..

ఉదయం 11:40 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12:30గంటలకు పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజీకు చేరుకుంటారు. బ్యారేజీని పరిశీలిస్తారు. అక్కడినుంచి ఒంటిగంటకు బయలుదేరి 01:15 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్నారం బ్యారేజీకి చేరుకుంటారు. 01:45 వరకు బ్యారేజీని పరిశీలిస్తారు. 01:45 గంటలకు అన్నారం బ్యారేజీనుంచి బయలుదేరి 2 గంటలకు మేడిగడ్డకు చేరుకుని భోజనం చేస్తారు. 3 గంటల నుంచి 4 గంటల వరకు మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ కార్యదర్శి, ఈఎన్సీలు, సీఈలు, ఎస్ఈలు, ఇతర కేడర్లకు చెందిన అధికారులు హాజరుకానున్నారు.

నేడు పీసీ ఘోష్ రాక

సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ బృందం శుక్రవారం మధ్యాహ్నం 3.15గంటలకు అన్నారం బ్యారేజీని పరిశీలించనుంది. బృందం సభ్యులు రాత్రి ఎన్టీపీసీలో బసచేస్తారు. శనివారం ఉదయం 9.30గంటలకు పెద్దపల్లి జిల్లాలోని సుందిళ్ల బ్యారేజీని పరిశీలిస్తారు.

మేడిగడ్డ 7వ బ్లాక్‌లో 16, 17 రేడియల్ గేట్ల ఎత్తివేత

బ్యారేజీలో మొరాయించిన 16, 17వ రేడియల్ గేట్లు బలంగా బిగుసుకుపోవడంతో గురువారం టెక్నికల్‌గా పైకి ఎత్తారు. వర్షాకాలంలో వరద నీరు గేట్ల నుంచి దిగువకు తరలివెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఎన్డీఎస్ఏ వరద నీటిని నిలపవద్దని ఆదేశించిన విషయం తెలిసిందే. 7వ బ్లాక్‌లో ని 20, 21 గేట్ల కటింగ్ పనులు జరుగుతున్నాయి.

డాక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

హన్మకొండ: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించే డాక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ వి.హనుమంతు పిలుపునిచ్చారు. తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో 46వ డాక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఆయన ఒక గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల 14లోపు కె.శంకర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్-500001 చిరునామాకు పోస్టల్ కవర్‌లో పంపాలని సూచించారు. కవర్‌పై 46వ డాక్ అదాలత్ అని స్పష్టంగా రాయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలులో చైన్‌స్నాచింగ్

- కిటికీ పక్కన నిద్రిస్తున్న మహిళ మెడలోనుంచి గొలుసు లాక్కెళ్లిన దొంగలు

చిల్పూరు/కాజీపేట రూరల్: రైలులో చైన్‌స్నాచింగ్ జరిగింది. కిటికీ పక్కన నిద్రిస్తున్న మహిళ మెడలోనుంచి 20 గ్రాములు (రెండు తులాలు) బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున మండలంలోని నష్కల్- పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్య జరిగింది. కాజీపేట రైల్వే జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ కథనం ప్రకారం.. నాగర్‌సోల్- నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి కాజీపేటకు వస్తోంది. ఈ రైలులో ఏపీలోని విజయవాడకు చెందిన అన్నెపుర కవిత ప్రయాణిస్తోంది. కిటికీ పక్కన గాఢ నిద్రలో ఉన్న ఆమెను ఎప్పటి నుంచో దొంగలు గమనిస్తున్నారు. ఈ క్రమంలో నష్కల్ రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే అక్కడ అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో రైలు పూర్తిగా వేగం తగ్గింది. ఇదే అదునుగా భావించి దొంగలు.. కవిత మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లారు. నిద్రలేచిన ఆమె బంగారు గొలుసు చోరీ అయినట్లు తెలుసుకుంది. అప్పటికే రైలు కాజీపేటకు చేరుకోగా రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసిందని జీఆర్పీ ఎస్సై తెలిపారు. కాగా, గొలుసు చోరీ విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, చిల్పూరు ఎస్సై రాజేందర్ ఆ ప్రాంతంలో చుట్టు పక్కల వెతికారు. ఇదిలా రైలు విజయవాడకు వెళ్లిన తర్వాత కొందరు ప్రయాణికులు తమ బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు తమకు చెప్పారని కాజీపేట జీఆర్పీ పోలీసులు తెలిపారు. నాగర్‌సోల్ రైలులో 5 బోగీలలో ప్రయాణిస్తున్న ప్రయాణికుల నుంచి దొంగలు పెద్ద మొత్తంలో బంగారం దోచుకున్నారని సమాచారం.

కర్మకాండలకు వచ్చి అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రవి(ఫైల్)

సంగెం: అత్త ఐదో రోజు (కర్మకాండ) కార్యక్రమానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో అల్లుడు అనంతలోకాలకు వెళ్లగా, వియ్యంపురాలికి తీవ్ర గాయాలైన విషాద ఘటన సంగెం మండలంలో చోటు చేసకుంది. పోలీసుల కథనం ప్రకారం మహబుబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం రాతుగూడేనికి చెందిన మాలోత్ రవి(36) తల్లి సోనా, భార్య సరితతో కలిసి బుధవారం సంగెం మండలం తిమ్మాపూర్‌లో అత్త అంగోత్ మంగమ్మ ఐదో రోజు కర్మకాండలకు హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో మండలంలోని ఎల్గూర్‌రంగంపేట గ్రామానికి చెందిన బాలుడు పోతుల రాంచరణ్ ద్విచక్రవాహనంపై ఎదురుగా రవిని ఢీకొన్నాడు. దీంతో రోడ్డుపై పడిన రవి, సోనాకు తీవ్రంగా, సరితకు స్వల్ప గాయాలయ్యాయి. 108లో ఎంజీఎం తరలించి చికిత్స చేయిస్తుండగా రవి అదేరోజు రాత్రి మృతి చెందాడు. సోనా, సరిత చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు రాంచరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ వెల్లడించారు.

పట్టుదలతో సాధన చేయాలి

ఏషియన్ గేమ్స్ హెప్టాథ్లాన్ బ్రాంజ్ మెడలిస్ట్ నందిని అగాసార

- ప్రతిభగల క్రీడాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి
- పారాఅథ్లెట్ చాంపియన్ దీప్తి జీవాంజీ
- జేఎన్ఎస్‌లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు



దీప్తికి రూ.50 వేల నగదు పురస్కారం అందజేసి సన్మానిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: 'అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లోనూ పట్టుదల, క్రమశిక్షణతో రోజూ సాధన చేయండి విజయం మీ సొంతమవుతుంది' అని అంతర్జాతీయ అథ్లెట్ నందిని అగాసార అన్నారు. ఇటీవల చైనాలో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో నందిని అగాసార.. అథ్లెటిక్స్‌లో హెప్టాథ్లాన్ విభాగంలో కాంస్య పతకం సాధించి హైదరాబాద్ పేరును మరోసారి ప్రపంచస్థాయిలో నిలబెట్టింది. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తెలంగాణ రాష్ట్ర యూత్ బాలబాలికల అండర్-18, మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ గురువారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో నందిని మాట్లాడారు. విజేతగా నిలబడాలనే తపనకు శ్రమ తోడైనప్పుడే కలలు సాకారమవుతాయన్నారు. అనంతరం ఇటీవల జపాన్‌లో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచి ప్రపంచ రికార్డు సాధించిన వరంగల్ జిల్లా కల్లెడకు చెందిన దీప్తి జీవాంజీ మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులను ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ రికార్డు సాధించినప్పటికీ తనకు ఎలాంటి ప్రోత్సాహం లేదన్నారు. ప్రభుత్వం ఉద్యోగం, ఇంటి వసతి కల్పించాలని కోరారు. కాగా, ముగ్గురు అంతర్జాతీయ అథ్లెట్లు నందిని, దీప్తి, సాయి సంగీతను హనుమకొండ అథ్లెటిక్స్ అసో సియేషన్ ఆధ్వర్యంలో రూ. 50 వేల నగదు పురస్కారంతో సన్మానించారు. అలాగే, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్టాన్‌లీజోన్స్‌నూ సన్మానించారు. డీవైఎస్ఓ అశోక్, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు వరద రాజేశ్వర్‌రావు, కే సారంగపాణి, ఐలి చంద్రమోహన్‌గౌడ్, పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, గంగిశెట్టి మనోజ్, యుగంధర్‌రెడ్డి, టెక్నికల్ అఫీషియల్స్ వాసుదేవరావు, సాంబమూర్తి, అశ్విని పాల్గొన్నారు.

942 మంది అథ్లెట్లు హాజరు

సబ్ జూనియర్స్ కేటగిరీలో అండర్-8,10,12, 14,16, 20 విభాగాల్లో బాలబాలికలకు 50, 150, 80 , 100, 300, 400మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, బ్రాడ్ జంప్, కిడ్స్ జావెలిన్ ఈవెంట్లు నిర్వహించగా, సీనియర్ మెన్ అండ్ ఉమెన్, యూ త్ అండర్-18 విభాగాల్లో 100, 400, 800, 5000 మీటర్ల పరుగు, 110 మీటర్ హార్డిల్, షాట్‌పుట్, ట్రిబుల్ జంప్, డిస్కస్‌త్రో, హైజంప్, జావెలిన్‌త్రో, లాంగ్ జంప్, మిడ్‌లే రిలే, 4,400 మిక్స్‌డ్ రిలే, రేస్‌వాక్, హెప్టాథ్లాన్ ఈవెంట్లలో పోటీలు కొనసాగుతాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి 942 మంది అథ్లెట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

15 నుంచి 19వ నేషనల్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు..

అండర్-18 యూత్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న 19వ నేషనల్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని హనుమకొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు హరియాణలో జరగనున్న 63వ నేషనల్ సీనియర్ ఇంటర్ స్టేట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.



400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు, షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారుడు

'పట్టభద్రుల' ఫలితంపై ఉత్కంఠ

- మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని గెలుపు
- కొనసాగుతున్న రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు
- మొదటి ప్రాధాన్యతలో తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు
- గెలుపు టార్గెట్ 1,55,095 ఓట్లు
- నేడు తేలనున్న తుది ఫలితం

నల్లగొండ: రెండు రోజులుగా కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ నెలకొంది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ గెలుపునకు సరిపడా ఓట్లు రాలేదు. గెలుపు కోసం 1,55,095 ఓట్లు రావాల్సి ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరూ విజయం సాధించకపోవడంతో ఎన్నికల అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తున్నారు. 52 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన చివరి అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ.. వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ గురువారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం ఫలితం తేలే అవకాశం ఉంది.



ఓట్లు లెక్కిస్తున్న సిబ్బంది

మొదటి ప్రాధాన్యతలో వచ్చిన ఓట్లు ఇలా..

మొదటి ప్రాధాన్యతలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 1,22,813 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 29,697 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. ఇందులో గెలుపుకు నిర్ణయించిన టార్గెట్ ప్రకారం ఏ అభ్యర్థికీ ఓట్లు రాలేదు.

అభ్యర్థుల్లో టెన్షన్..

మొదటి ప్రాధాన్యత ఓట్లలో మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయన గెలుపునకు ఇంకా 32,283 ఓట్లు రావాలి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు అవసరం ఉంది. రెండో ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితం తేలనుంది. రెండో ప్రాధాన్యతలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేసి రెండో ప్రాధాన్యత లెక్కించే క్రమంలో 10 వేల ఓట్లు వచ్చిన అభ్యర్థులందరినీ ఎలిమినేట్ చేసి వారి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అప్పటికి కూడా ఎవరికి గెలుపునకు కూడా సరిపడా ఓట్లు వచ్చే అవకాశం లేకపోతే.. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థి అశోక్ ఓట్లను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన 29,697 ఓట్లలో రెండో ప్రాధాన్యత ఎవరికి పడ్డాయో ఆ ఓట్లను లెక్కిస్తే గెలుపునకు దగ్గరగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. దాంతో కూడా తేలకపోతే.. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తేనే చివరి ఫలితం వెలువడే అవకాశం కనిపిస్తోంది.